సాక్షి తిరుపతి

సోమవారం । 3 । మార్చి । 2025

ఇఫ్తార్ సహర్
సోమవారం (సా) మంగళవారం (ఉ)

	ఇఫ్తార్	సహర్
తిరుపతి	6-24	5-09
గూడూరు	6-19	5-05

రంజాన్ వేళలు

వైభవం.. గిరి ప్రదక్షిణం

- ఘనంగా కొండచుట్టు మహోత్సవం – సమస్త దేవగణాలకు వీడ్కోలు పలికిన పార్వతీపరమేశ్వరులు
- ఎదురుసేవలో ఆదిదంపతులకు స్వాగతం పలికిన భక్తులు




గిరిప్రదక్షిణకు వెళుతున్న స్వామి, అమ్మవార్లు (ఇన్‌సెట్) విశేషాలంకరణలో ఆదిదంపతులు



స్వామి, అమ్మవారి సేవలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం జ్ఞానప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరస్వామివారి కైలాస గిరి ప్రదక్షిణ అత్యంత వైభవంగా సాగింది. తమ కల్యాణానికి విచ్చేసిన సకల దేవతా గణాలు, రుషులకు పార్వతీ పరమేశ్వరులు ఘనంగా వీడ్కోలు పలికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలోని యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చప్పరాలపై స్వామి అమ్మవార్లను అధిష్టింపజేసి గిరి ప్రదక్షిణకు తీసుకెళ్లారు. భేరివారి మండపం వద్ద భేరికులస్తులు ఇచ్చిన నాగవల్లిని అమ్మవారికి ధరింపజేశారు. అనంతరం జయరామారావువీధి, ఎన్టీఆర్ నగర్, తెలుగుగంగకాలనీ, కైలాసగిరికాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ మీదుగా గిరిప్రదక్షిణ సాగింది. అంజూరు మండపంలో ఆదిదంపతులు కాసేపు సేదతీరారు. అనంతరం వెయ్యిలింగాలకోన, వేడాం మీదుగా శుక బ్రహ్మాశ్రమం సమీపంలోని ఎదురుసేవ మండపానికి స్వామి అమ్మవార్లు సాయంత్రానికి చేరుకున్నారు. ఆలయ అధికారులు అర్చకులు, పెద్దసంఖ్యలో భక్తులు స్వాగతం పలికారు. రాత్రి ఆదిదంపతులను అశ్వ, సింహ వాహనాలపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. గిరిప్రదక్షిణ ఉభయకర్త, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ స్వామివారి ఉత్సవానికి ఉభయకర్తగా వ్యవహరించడం పూర్వజన్మ సుకృతమని తెలిపారు. కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి, ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితారెడ్డి పాల్గొన్నారు.




అశ్వ, సింహ వాహనాలపై ఊరేగుతున్న ఆదిదంపతులు

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు.

దయాగుణంతో 'దీక్ష'



సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రీ, ప్రభుత్వ ఖాజీ

తిరుపతి కల్చరల్ : నెలవంక దర్శనంతో ఆదివారం నుంచి పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైందని, ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు పాటిస్తూ దయాగుణం చాటాలని ప్రభుత్వ ఖాజా సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి పిలుపునిచ్చారు. ఆదివారం కాద్రి పీఠంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రంజాన్ మాసంలో ప్రతి క్షణం దివ్యమని, ప్రతి ఒక్కరూ అల్లాహ్‌ను స్మరిస్తూ ప్రార్థన చేయాలని కోరారు. మార్చి 2 నుంచి నిరంతరం 30 రోజులపాటు ఉపవాస దీక్షలు ఆచరించాలని సూచించారు. సూర్యోదయానికి ముందే మేల్కొని ఉపవాస దీక్ష సంకల్పించి ప్రత్యేక ప్రార్థన(తాహజాత్) చేయడంతో పాటు సూర్యాస్తమయం తర్వాత ఉపవాస దీక్ష(ఇఫ్తార్)తో విరమించాలని తెలిపారు. ఏకాగ్రతతో ఖురాన్ గ్రంథం చదవాలని, లేదా వినాలని చెప్పారు. ఇస్లాం ధర్మంలో ఒక్కటైన 'జకాత్' చేపట్టాలని, సమాజ శ్రేయస్సు కోసం ముస్లింలు దాన ధర్మాలు చేయాలని తెలిపారు. రాత్రి వేళ 'తరావీ' నమాజు తప్పక చదవాలని కోరారు. దేశ సమైక్యత, ప్రపంచ శాంతి, భద్రత కోసం ప్రార్థనలు చేయాలని సూచించారు.

8 నుంచి తుడా టవర్స్ ఈ- వేలం

తిరుపతి తుడా : తిరుపతి నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద నిర్మిస్తున్న తుడా టవర్స్‌లోని రెసిడెన్షియల్ ఫ్లాట్లను ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఈ–వేలం వేయనున్నట్లు తుడా వైస్ చైర్మన్ మౌర్య తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ రూ.345కోట్ల అంచనా వ్యయంతో జీప్లస్ 13 భవనం నిర్మిస్తున్నామన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఆరు అంతస్తుల నిర్మాణం పూర్తిచేసినట్లు చెప్పారు. 2026 ఏప్రిల్ నాటికి మొత్తం భవన నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. నివాస గృహాలకు సంబంధించి 2వ అంతస్తు నుంచి 13వ అంతస్తు వరకు డబుల్ బెడ్‌రూం ఫ్లాట్లు 46, త్రిబుల్‌బెడ్ రూమ్–152, నాలుగు బెడ్‌రూమ్ – 32 వెరసి మొత్తం 230 నిర్మిస్తున్నట్లు వివరించారు. అలాగేస్విమ్మింగ్ పూల్, జిమ్, షటిల్ కోర్టు, ల్యాండ్ స్కేపింగ్ పోడియం, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, రెస్టారెంట్ వంటి ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగలవారు ఈ–వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు udaap.in.tudaotwerr.in వెబ్‌సైట్ సందర్శించాలని సూచించారు.

ఇసుకాసురుల వికటాట్టహాసం

కూటమి నేతల కోరల్లో చిక్కి స్వర్ణమ్మ విలవిల్లాడుతోంది. ఇష్టారాజ్యంగా జేసీబీలతో ఇసుక తవ్వేస్తుంటే గర్భశోకంతో కన్నీరుపెడుతోంది. తమ్ముళ్ల ధన దాహం తీర్చలేక కొట్టుమిట్టాడుతోంది. పరిరక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో మౌనంగా రోదిస్తోంది. సహజంగా ఏర్పడిన మేటలు మాయమవుతుంటే చేసేదిలేక దిగాలు పడుతోంది. నిలువెత్తు గుంతలను చూసుకుంటూ కుమిలిపోతోంది. అక్రమార్జనే లక్ష్యంగా రెచ్చిపోతున్న ఇసుకాసురుల వికటాట్టహాసంతో భయాందోళన చెందుతోంది.



స్వర్ణముఖి నదిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలు



రెచ్చిపోతున్న కూటమి నేతలు

- స్వర్ణముఖిలో యథేచ్ఛగా సైఖతం'
- యంత్రాలతో ఇష్టారాజ్యంగా తవ్వకం
- నదీమతల్లికి తప్పని గర్భశోకం
- రాత్రింబవళ్లు అక్రమంగా ఇసుక తరలింపు
- పట్టించుకోని పోలీసులు, రెవెన్యూ అధికారులు

రేణిగుంట/శ్రీకాళహస్తి రూరల్ : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్వర్ణముఖి నదిని ప్రధాన ఆదాయ వనరుగా కూటమి నేతలు మార్చేసుకున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో ఎక్కడ పడితే అక్కడ ఇసుకను తవ్వేస్తున్నారు. యథేచ్ఛగా రాష్ట్ర సరిహద్దులు దాటిస్తూ రూ.కోట్లు పోగేసుకుంటున్నారు. స్వర్ణముఖిలోకి నిత్యం జేసీబీలు, ట్రాక్టర్లు, లారీలు రాకపోకలు సాగిస్తున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో పచ్చ నేతలు మరింతగా రెచ్చిపోతున్నారు. నదిలో జేసీబీల సాయంతో ఇష్టారాజ్యంగా రాత్రింబవళ్లు తవ్వకాలు సాగిస్తున్నారు. నదీతీరంలో గ్రామాల్లో తిష్ట వేసి ఇసుక అక్రమ రవాణాను పర్యవేక్షిస్తున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోనే గతంలో ఇసుకాసురుల ధనదాహానికి ఎందరో అభాగ్యులు ప్రాణాలు కోల్పోయారు. ఆయా ఘటనలు రాష్ట్రస్థాయిలో సంచలనం రేపిన విషయం విధితమే. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఇసుకాసురులు ముఠాగా మారి స్వర్ణముఖిలో సహజ వనరులను తోడేస్తున్నా, అధికారులు మాత్రం కన్నెత్తి చూడడం లేదు. పోలీసులు మాత్రం అప్పుడప్పుడూ మొక్కుబడిగా ట్రాక్టర్లను స్వాధీనం చేసకుని చిన్నపాటి కేసులు పెట్టి వదిలేస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారుల మాత్రం టీడీపీ ముఖ్య నేతకు విధేయంగా నడుచుకుంటున్నారు. ఆయన అనుచరులకు వంత పాడుతూ మాకేం కనపడలేదు.. మాకేం వినపడలేదు.. అన్నట్టు వ్యవహరిస్తున్నారు. పైగా అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు చేసిన వారి వివరాలను ఇసుకాసురులకు అందించేస్తున్నారు. దీంతో సామాన్యులు ఎవరైనా అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సైతం వణికిపోతున్నారు.

ఈ ప్రాంతాలే అడ్డా!



జీపాళెం సమీపంలో డంప్ చేసిన ఇసుక

రేణిగుంట మండలం కొత్రమంగళం, గాజులమండ్యం, తూకివాకం, జీపాళెం, పిల్లపాళెం సమీపంలోని స్వర్ణముఖి నది నుంచి నిత్యం ఇసుక తవ్వేస్తున్నారు. ఒక్కో చోటు నుంచి ప్రతి రోజూ సగటను 50 నుంచి 70 ట్రాక్టర్ల ఇసుకను తరలిస్తున్నారు.

- జీపాళెం సమీపంలో మూడు నెలలుగా టీడీపీ ముఖ్య నేత అనుచరుడినని చెప్పుకుంటూ ఓ వ్యక్తి ఇసుకను రాత్రింబవళ్లు తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నాడు. ఒక ట్రాక్టర్ ఇసుక కావాలంటే ఆయనకు రూ.1,400 కప్పం కట్టాల్సి ఉంటుంది. సదరు ముఖ్యనేత అనుచరుడికి ముడుపు చెల్లిస్తే ఇక ట్రాక్టర్‌ను ఎవరూ ఆపరు. దీంతో రోజుకు 100 ట్రాక్టర్లకు పైగా ఇక్కడ నుంచి పగటి పూట తరలిస్తున్నారు. అదే రాత్రి వేళల్లో జేసీబీలు పెట్టి లారీలలో లోడ్ చేసి చెన్నై, బెంగళూరుకు అక్రమ రవాణా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు.



పిల్లపాళెం వద్ద ఇసుక తరలింపునకు దారి చేస్తున్న దృశ్యం

- కొత్రమంగళం నుంచి ఎక్కువగా తిరుపతికి, చుట్టుపక్కల గ్రామాలకు ఇసుక తరలిస్తున్నారు. నది వెంబడి ఉండే పంట పొలాలలో ఎలాంటి అనుమతులు లేకుండా 30 నుంచి 40 అడుగుల లోతు వరకు ఇసుకను తవ్వేసి అమ్మేస్తున్నారు.
- ఏర్పేడు మండలం పాపానాయుడుపేట, పెనుమల్లం, మునగలపాళెం, ఎండీ పుత్తూరు, కొత్తవీరాపురం గ్రామాల పరిధిలోని స్వర్ణముఖీ నది నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది.
- శ్రీకాళహస్తి మండలం రామాపురం, రామలింగాపురం, వేడాం, చుక్కలనిడిగల్లు గ్రామాల నుంచి విచ్చలవిడిగా ఇసుక తరలిపోతోంది. తొట్టంబేడు మండలం విరూపాక్షపురం, బసవయ్యపాళెం, కన్నలి, చోడవరం, కాసరంలో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తున్నారు.



పిల్లపాళెం వద్ద స్వర్ణముఖి నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్



రేణిగుంట మండలం పిల్లపాళెం వద్ద స్వర్ణముఖిలో ఇసుక తవ్వుతున్న జేసీబీ

కక్ష సాధింపు చర్యలు సిగ్గుచేటు



భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : ముఖ్యమంత్రిగా ఉండి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఏ విధమైన సాయం చేయకూడదని చంద్రబాబు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులకు చెప్పడం సిగ్గుచేటని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో మాత్రమే పార్టీల మధ్య పోటీ ఉండాలే తప్ప ఎన్నికల అనంతరం పార్టీలకు అతీతంగా పాలన సాగించాలన్నారు. కానీ చంద్రబాబునాయుడు కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. జగనన్న పాలనలో టీడీపీ నాయకులకే ఎక్కువ శాతం సంక్షేమ పథకాలు అందించారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా ఏ ఒక్క హామీనైనా నెరవేర్చావా? చంద్రబాబూ అని ప్రశ్నించారు. జగనన్న పాలనలో రూ.2.5లక్షల కోట్లు సంక్షేమ పథకాల రూపంలో పేదప్రజలకు అందించారని గుర్తుచేశారు. పేదలకు మంచి చేశారు కాబట్టే గత ఎన్నికల్లో 40 శాతం ఓట్లు జగనన్నకు వేశారని గుర్తుచేశారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చి సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా సంపద సృష్టించలేకపోతున్నానంటూ మరోసారి అబద్ధాలు చెప్పి ప్రజలను మోసగిస్తున్న ప్రజాద్రోహి చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, లోకేష్‌లు రెడ్ బుక్ పాలన సాగిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, సోషయల్ మీడియాపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రజలంతా చంద్రబాబు అరాచకాలు, దౌర్జన్యాలను గ్రహిస్తున్నారని, త్వరలోనే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

గ్రీన్ చానల్ ద్వారా గుండె తరలింపు



గుండెను తరలిస్తున్న అంబులెన్స్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట విమానాశ్రయానికి ఆదివారం సాయంత్రం విమానంలో చేరుకున్న గుండెను అంబులెన్స్‌లో గ్రీన్ చానల్ ద్వారా తిరుపతి పద్మావతి హృదయాలయానికి తరలించారు. ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

పెత్తనం నీదా.. నాదా!

సైదాపురం మండలంలోని గనుల కోసం కూటమి నేతలు కొట్లాడుకుంటున్నారు. ప్రధానంగా శ్రీనివాసా పద్మావతి మైన్స్‌ను సొంత చేసుకునేందుకు ప్రచ్ఛన్న యుద్ధానికి తెరలేపారు. నెల్లూరుకు చెందిన ఓ ముఖ్యనేత ఆధిపత్యం సహించలేని స్థానిక ప్రజాప్రతినిధి మండిపడుతున్నారు. ఆదివారం ఈ క్రమంలోనే పోలీసు.. రెవెన్యూ అధికారులను రంగంలోకి దించారు. అయితే సదరు ముఖ్యనేత జోక్యం చేసుకోవడంతో చేసేదిలేక చేతులెత్తేశారు. తూతూమంత్రంగా చర్యలు తీసుకుని ముఖం చాటేశారు.

- శ్రీనివాసా పద్మావతి గని కోసం కూటమి నేతల ఘర్షణ
- సిండికేట్‌కు వ్యతిరేకంగా స్థానిక ప్రజాప్రతినిధి ఆదేశాలు
- ముఖ్య నేత జోక్యంతో తలలు పట్టుకుంటున్న అధికారులు



గని వద్ద యంత్రం ఉన్న దృశ్యం

సైదాపురం : మండలంలోని రామసాగరం, సైదాపురం గ్రామాలకు చెందిన ప్రభుత్వ భూమిని శ్రీనివాసాపద్మావతి గనికి గతంలో కేటాయించారు. 2019లోనే లీజు కాలపరిమితి తీరిపోవడంతో అది కాస్తా మూతపడింది. ఈ క్రమంలోనే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దానిపై పలువురు నేతల కన్నుపడింది. ఎలాంటి అనుమతులు లేకుండా నెల్లూరుకు చెందిన టీడీపీ పెద్దల ఆధ్వర్యంలో మైనింగ్ ప్రారంభమైంది. ఈ క్రమంలో ఆదివారం రామసాగరం గ్రామస్తులు కొందరు అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన మైనింగ్ సిండికేట్‌కు చెందిన వ్యక్తులు తమకు అధికారపార్టీ ఎంపీ, మరో నాయకుడి మద్దతు ఉందని గ్రామస్తులను బెదిరించి తరిమేశారు.

ప్రజాప్రతినిధి ఆగ్రహం

మైనింగ్ సిండికేట్ దౌర్జన్యాలపై రామసాగరం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక ప్రజాప్రతినిధి దృష్టికి విషయం తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే ఫోన్ చేసి మైనింగ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు మైన్స్ వద్దకు వచ్చిన పోలీసులు 8 మోటారుసైకిళ్లు, ఓ ఎస్‌యూవీ వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తదనంతరం ఏం జరిగిందో కానీ.. పోలీసులు సీజ్ చేసి వాహనాలు స్టేషన్ ఆవరణ నుంచి వెళ్లిపోయాయి. ఈ విషయం స్థానిక ప్రజాప్రతినిధికి తెలియడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు వెంటనే తహసీల్దార్ రమాదేవి, ఎస్‌ఐ క్రాంతికుమార్ హుటాహుటిన శ్రీనివాసా పద్మావతి గని వద్దకు చేరుకున్నారు. అక్రమ మైనింగ్‌పై విచారణ చేపట్టారు.



గనిలో నీరు పంపింగ్ చేస్తున్న దృశ్యం

అనుమతులు ఎలా..?

శ్రీనివాసా పద్మావతి గనిలో మైనింగ్ కోసం వచ్చిన దరఖాస్తును జనవరిలో తిరస్కరించారు. ఇంతలో ఏమైందో తెలియదు కానీ, నెల గడవక ముందే సదరు గనిలో 1.5లక్షల టన్నుల ఖనిజం తవ్వుకుని తరలించుకునేందుకు అనుమతులు మంజూరయ్యాయి. అది కూడా ఈ గనిపై కోర్టులో కేసు నడుస్తుండగానే అధికారులు పర్మిషన్ ఇవ్వడం గమనార్హం.

మైనింగ్‌కు అనుమతి లేదు

"శ్రీనివాసా పద్మావతి గనిలో అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు గనిని పరిశీలించాం. ఇక్కడ కేవలం పంపింగ్ మాత్రమే చేస్తున్నారు. ఖనిజం తరలించేందుకే అనుమతి ఉంది. మైనింగ్‌కు లేదు.

– రమాదేవి, తహసీల్దార్, సైదాపురం

ఫిర్యాదు అందలేదు

శ్రీనివాసా పద్మావతి గనిలో అక్రమ మైనింగ్‌పై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. ఇక్కడ వాహనాలను స్వాధీనం చేసుకోలేదు. ఎవరినీ అదుపులోకి తీసుకోలేదు.

– క్రాంతికుమార్, ఎస్‌ఐ, సైదాపురం

భారతీయ జ్ఞానం.. విశ్వవ్యాప్తమే లక్ష్యం



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభిస్తున్న పీఠాధిపతులు, అతిథులు

తిరుపతి సిటీ: భారతీయ జ్ఞానం, సనాతన ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేయాలని శ్రీశైల పీఠం జగద్గురు డాక్టర్ చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి పిలుపునిచ్చారు. జాతీయ సంస్కృత వర్సిటీ, బెంగళూరుకు చెందిన అఖిల భారత వీరశైవ శివాచార్య సంస్థాన్ సంయుక్తంగా వర్సిటీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం శక్తి విశిష్టాద్వైతం అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పీఠాధిపతులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శక్తి విశిష్టాద్వైతం మహత్యాన్ని ఆధునిక దార్శనికులకు అందించడం శుభపరిణామమన్నారు. సంస్కృత భాష ఔన్నత్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం అధ్యాపకులు, విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాశీపీఠం జ్ఞాన సింహాసనధీశులు డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్యులు మాట్లాడుతూ ఎన్ఎస్‌యూలో అద్వైత వేదాంత విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి సదస్సు నిర్వహించి శక్తి విశిష్టాద్వైతం గొప్పతనాన్ని తెలియజేయడం అభినందనీయమన్నారు. ఇందులో సారాంశాన్ని గ్రహించి ఆధ్యాత్మిక తత్త్వ అన్వేషణలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సదుస్సులో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, డీన్ రజనీకాంత్‌శుక్లా, ప్రొఫెసర్ గణపతిభట్, సతీష్, నాగరాజభట్, శివ రామదాయగుడే, మనోజ్‌షిండే, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు ఢీకొని ఒకరి మృతి
– మరొకరికి గాయాలు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గూడూరురూరల్ : మండలంలోని చెన్నూరు వద్ద ఆదివారం ఉదయం కారు ఢీకొని ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. గ్రామంలోని కాపువీధి చెందిన అల్లూరు మురళీరెడ్డి(58), శీకిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి ప్రతిరోజూ ఉదయం వాకింగ్‌కు వెళుతుంటారు. ఈ క్రమంలోనే వ్యాహ్యాళికి వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా వెంకటగిరి నుంచి గూడూరు వైపునకు వస్తున్న కారు ఢీకొంది. దీంతో మురళీరెడ్డి అక్కడికక్కడే మరణించాడు. గాయపడిన రామ్మోహన్‌రెడ్డిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఎస్‌ఐ మనోజ్‌కుమార్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నార. మురళీరెడ్డి మృతితో చెన్నూరులో విషాదఛాయలు అలుముకున్నాయి.


మురళీరెడ్డి(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు


స్తంభాన్ని ఢీకొన్న కారు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట సమీపంలోని మర్రిగుంట సర్కిల్‌లో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వివరాలు.. ప్రకాశం జిల్లా నుంచి వస్తున్న కారు అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొంది. దీంతో అందులో ప్రయాణిస్తున్న మహిళకు గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని 108లో ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.



'అసలు చంద్రగిరి నియోజకవర్గంలో ఏం జరుగుతోంది.. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత మండలంలో ఏసీబీ దాడులు జరగడమేంటి..? అక్కడి ఉద్యోగులు యథేచ్ఛగా అవినీతికి పాల్పడేందుకు కారణమేంటి..? టీడీపీ స్థానిక నేతలకు డబ్బులు చెల్లించి పోస్టింగ్ తెచ్చుకున్నందుకే బరితెగించేశారా..? అదురు బెదురు లేకుండా బహిరంగ వసూళ్లకు దిగుతున్నారా..? పచ్చనేతల ముడుపుల వ్యవహారం సీఎం వరకు చేరిందా..? సీఎంఓ ఆదేశాలతోనే ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారా..?. నియోజకవర్గవ్యాప్తంగా లంచావతారుల ఆడియో, వీడియో రికార్డులను బాధితులను నుంచి సేకరించారా..? అంటే ప్రజల నుంచి అవుననే సమాధానం వినిపిస్తోంది.

అసలు కారణం.. ఆమ్యామ్యాలేనా?

- చంద్రగిరిలో ఉద్యోగులు బరితెగించేశారా?
- డబ్బులు ఇచ్చి పోస్టింగ్ తెచ్చుకున్నందుకే దోపిడీకి దిగారా?
- బాధితుల చేతుల్లో లంచావతారుల ఆడియో, వీడియో రికార్డులు?
- ముఖ్యమంత్రి ఇలాకాలో రాజ్యమేలుతున్న అవినీతి!
- టీడీపీ నేతల అక్రమాలపై సీఎంఓ ఆరా!

సాక్షి టాస్క్‌ఫోర్స్: ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత మండలం చంద్రగిరిలో పంచాయతీ అధికారి ఏసీబీకి పట్టుబడిన విషయం విధితమే. దీంతో అప్రమత్తమైన పోలీసు నిఘా వర్గాలు ఇక్కడి అవినీతి, అక్రమాలపై సీఎం కార్యాలయానికి నివేదిక అందజేసినట్టు సమాచారం. ప్రధానంగా తిరుపతి నగరానికి సమీపంలోని చంద్రగిరి, తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాల్లో పనిచేస్తున్న రెవెన్యూ అధికారులు విచ్చలవిడిగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నట్టు తెలుస్తోంది. తిరుపతి రూరల్ మండలంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ , ఇనాం, మఠం భూములను టీడీపీ నేతలకు కట్టబెట్టారని నివేదికలో పొందుపరిచినట్లు తెలిసింది. అక్రమార్కులతో కుమ్మక్కై వాటాలు తీసుకుని నదులు, గుట్టలను తవ్వేస్తున్నా, ఇసుకను అమ్మేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఫిర్యాదులు కూడా సీఎంఓకు చేరినట్టు సమాచారం. ప్రభుత్వ కార్యాలయాలకు పని మీద వచ్చే ప్రజల నుంచి ప్రతి పనికీ ఓ రేటు ఫిక్స్ చేసి బహిరంగ వసూళ్లు చేయడంపై సీఎంఓ సీరియస్ అయినట్లు తెలుస్తోంది. ఈ విషయాలను కూటమి ప్రభుత్వంలో భాగమైన బీజేపీ, జనసేన నేతలు తమ పార్టీల అధినేతల దృష్టికి కూడా తీసుకు వెళ్లినట్టు తెలిసింది.

ఎన్నడూ లేని విధంగా..
చంద్రగిరి నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగులకు అవినీతి మరకలు అంటుకుంటున్నాయి. దీనికి కారణం ఉద్యోగుల బదిలీల్లో భారీ ముడుపులు అందించడమనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే స్థానిక నేతల అక్రమాలపై టీడీపీని ఓ బలమైన వర్గం ఇతర కూటమి నేతలతో కలసి అధిష్టానానికి ఫిర్యాదులు చేసినట్టు సమాచారం. ప్రభుత్వానికి అనుకూల పత్రికల్లో వరుసగా వార్తలు వస్తున్నా.. వారిలో మార్పు రావడంలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌కు విన్నవించుకున్నట్టు తెలిసింది.

డబ్బులిచ్చి వచ్చారు.. జైలుకు వెళుతున్నారు..
చంద్రగిరి నియోజకవర్గంలో ఉద్యోగం చేయడానికి స్థానిక నేతలకు డబ్బు ఇచ్చి వచ్చిన ఉద్యోగులపై ఏసీబీ కన్నువేయడంతో ఒక్కొక్కరుగా జైలుకు వెళతారన్న పుకార్లు షికారు చేస్తున్నాయి. బదిలీల సమయంలో డబ్బులు తీసుకున్న పెద్ద మనుషులు "మీ సంపాదనలో ఎక్కడ సమస్య రాదు.. అన్నీ మేం చూసుకుంటాం".. అని భరోసా ఇచ్చినప్పటికీ ఏసీబీ దాడులతో ఉద్యోగుల్లో భయం పట్టుకున్నట్టు సమాచారం. ముడుపులు చెల్లించి పోస్టుల్లోకి వచ్చిన అధికారులు ఆ డబ్బు సంపాదించుకోవడానికి విచ్చలవిడిగా అవినీతికి తెర లేపారన్న విమర్శలు వస్తున్నాయి. చంద్రగిరి నియోజకవర్గంలో ఏ పని కావాలన్నా సొమ్ము ముట్టజెప్పాల్సి వస్తోందనే ఆరోపణలు సామాన్యుల నుంచి వ్యక్తమవుతున్నాయి. అధికారులు ఇలా బరితెగించి డబ్బులు వసూలు చేస్తుండడంతో కనిపించిన ప్రతి టీడీపీ నాయకుడిని ప్రజలు బహిరంగంగానే తిడుతుండడం గమనార్హం.

రెచ్చిపోయిన మట్టి మాఫియా


గ్రామస్తులతో అక్రమార్కుల వాగ్వాదం

రామచంద్రాపురం: మండలంలోని కమ్మపల్లెలో ఆదివారం మట్టి మాఫియా రెచ్చిపోయింది. స్థానిక సిద్దేశ్వర ఎస్టీ కాలనీవాసులపై దాడికి తెగబడింది. వివరాలు.. రావిళ్ల వారిపల్లెలోని సర్వే నంబరు 233లో ధనలక్ష్మీ స్టోన్ క్రషర్ నిర్వాహకుడు సురేష్ రెడ్డి 2017లో క్వారీ నిర్వహణకు అధికారికంగా అనుమతులు పొందారు. గడువు ముగిసిన తర్వాత సురేష్ రెడ్డి తన భార్య గౌరి పేరు మీద అదే సర్వే నంబరులో నకిలీ స్కెచ్‌లను తయారు చేసుకుని అధికారుల ఆమోదం తీసుకున్నారు. డమ్మీ స్కెచ్‌లను ఆధారంగా చేసుకుని గనుల శాఖ అధికారులతో కుమ్మక్కై నకిలీ అనుమతులతో అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో మట్టి తరలించే లారీలను స్థానికులు అడ్డుకున్నారు. దీంతో అక్రమార్కులు వాగ్వాదానికి దిగారు. ప్రశ్నించిన వారిపై దాడి చేశారు. రామచంద్రాపురం పోలీసులు గ్రామానికి చేరుకుని మట్టి రవాణా చేస్తున్న టిప్పర్లను అక్కడ నుంచి పంపించేశారు. మట్టి తవ్వకాలు నిలుపుదల చేయాలని సురేష్ రెడ్డికి సూచించారు. దీంతో గ్రామస్తులు అక్కడ నుంచి వెనుదిరిగారు.

నేటి నుంచి ఆల్ ఇండియా పోస్టల్ క్యారమ్స్ టోర్నమెంట్


టోర్నమెంట్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సంతోష్ నేతా, పోస్టల్ అధికారులు

తిరుపతి సిటీ: దేశవ్యాప్తంగా ఉన్న పోస్టల్ ఉద్యోగుల మధ్య క్రీడాస్ఫూర్తిని, ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో తిరుపతి వేదికగా ఆల్ ఇండియా పోస్టల్ క్యారమ్స్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఏపీ సర్కిల్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ సంతోష్ నేతా వెల్లడించారు. ఆయన ఆదివారం తిరుపతి డివిజనల్ పోస్టాఫీసులో విలేకరులతో మాట్లాడారు. పోస్టల్ ఉద్యోగులకు ప్రతి ఏటా క్రీడలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది తిరుపతి మున్సిపల్ రోడ్డులోని స్మార్ట్ సిటీ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం నుంచి 7వ తేదీ వరకు క్యారమ్స్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో 13 రాష్ట్రాల పోస్టల్ సర్కిల్స్ నుంచి 108 మంది పురుషులు, మహిళా ఉద్యోగులు పాల్గొంటున్నారని తెలిపారు. 7వ తేదీన జరిగే ఫైనల్‌లో విజేతలకు ట్రోఫీని అందజేస్తామని, ప్రతిభ చూపిన ఉద్యోగులకు స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేస్తామన్నారు. అనంతరం టోర్నమెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో తిరుపతి డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ బి.నరసప్ప, కర్నూల్ డివిజన్ ఏడీ వెంకటరెడ్డి, విజయవాడ సర్కిల్ డీఎస్‌వీఆర్ మూర్తి, పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ విద్యార్థులకు అభినందనలు


జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొన్న మహిళా వర్సిటీ విద్యార్థులు

తిరుపతి సిటీ : తమిళనాడు కన్యాకుమారి వివేకానంద కాలేజ్ వేదికగా మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, ఎన్ఎస్ఎస్ చెన్నై ప్రాంతీయ డైరెక్టరేట్ సంయుక్తంగా గత నెల 22 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ సమైక్యతా శిబిరం శుక్రవారం ముగిసింది. పలు రాష్ట్రాల ఎన్ఎస్ఎస్ క్యాడెట్లతో సత్సంబంధాలు మెరుగుపరుచుకోవడం, విభిన్న సంస్కృతులపై అవగాహన పెంచుకోవడమే ప్రధాన లక్ష్యంగా శిబిరం నిర్వహించారు. ఇందులో మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి ఆంధ్రప్రదేశ్ కంటింజెంట్ లీడర్‌గా డాక్టర్ యువశ్రీ, వలంటీర్స్ రేణుశ్రీ, పావని, లిఖిత, కామాక్షి, వాణి, శైలజ పాల్గొన్నారు. ఈ శిబిరంలో పలు సేవా దృక్పథంతో కూడిన నైపుణ్యాలను ప్రదర్శించి అధికారుల మన్ననలు పొందారు. వారిని ఆదివారం పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య రజని, కోఆర్డినేటర్ ఆచార్య విద్యావతి, అధ్యాపకులు అభినందించారు.

10 నుంచి బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: కాకినాడ జిల్లా పిఠాపురం శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా ఈనెల 9వ తేదీన సాయంత్రం 6 గంటలకు మృత్సంగ్రహణం, అంకురార్పణ నిర్వహిస్తారు. 10న ఉదయం 10.10 నుంచి 10.30 గంటల మధ్య చేపట్టే ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 6 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం చేపడతారు. 11న సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీవారి గరుడ వాహన సేవ జరుగనుంది. 11, 12, 13 తేదీల్లో ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మ వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. 12, 13 తేదీల్లో సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు ఊంజల్ సేవ చేపడతారు. 14న ఉదయం 10.10 నుంచి 10.30 గంటల వరకు చక్రస్నానం, సాయంత్రం 5 గంటలకు ధ్వజావరోహణం నిర్వహించనున్నారు. 15వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు పుష్పయాగం నిర్వహిస్తారు.

చెరువును పూడిస్తే సహించం


చెరువులోకి మట్టి తోలిన దృశ్యం

తిరుపతి రూరల్ : మండలంలోని ఓటేరు పంచాయతీలో ఉన్న ఓటేరు చెరువును పూడిస్తే సహించే ప్రసక్తే లేదని స్థానికులు స్పష్టం చేశారు. ఆదివారం టిప్పర్లతో మట్టి తోలి చెరువును పూడ్చేందుకు యత్నించిన కబ్జాదారులను వారు అడ్డుకున్నారు. రూ.కోట్ల విలువైన చెరువు జోలికి వస్తే ఒప్పుకోమని తెగేసి చెప్పారు. దీంతో ఆక్రమణదారులు చల్లగా అక్కడ నుంచి జారుకున్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి


గాయపడిన డ్రైవర్ ముని

చంద్రగిరి : మండలంలోని ఎం.కొత్తపల్లి వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై గ్రామస్తులు దాడి చేశారు. వివరాలు.. పాకాల నుంచి తిరుపతి వైపునకు ఆర్టీసీ బస్సు వస్తుండగా ముంగిలిపట్టు హఠాత్తుగా రోడ్డుకు మధ్యకు ఓ ఆవు వచ్చింది. డ్రైవర్ చాకచక్యంగా తప్పించేందుకు యత్నించినా బస్సు వెనుక భాగం ఆవుకు తగిలింది. ఈ ప్రమాదంలో ఆవు మృతి చెందింది. అయినప్పటికీ బస్సును నిలపకుండా డ్రైవరు వెళ్లిపోతుండగా గ్రామస్తులు వెంబడించారు. ఎం.కొత్తపల్లి వద్ద బస్సు ఆపి, డ్రైవరు మునిపై దాడి చేశారు. దీంతో డ్రైవరు ముని అపస్మారక స్థితికి చేరుకోగా 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ఉత్సాహంగా ఇంటర్‌జోన్ స్పోర్ట్స్ మీట్



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: న్యూబాలాజీ కాలనీలోని భాష్యం సీవో క్యాంపస్‌లో భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాలలో విద్యార్థులకు ఇంటర్‌జోన్ స్పోర్ట్స్ మీట్ ఆదివారం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి నారాయణాద్రి హాస్పిటల్ ఎండీ డాక్టర్ సునందకుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడా రంగాల్లో రాణిస్తూ ప్రతిభావంతులుగా ఎదగాలని తెలిపారు. అనంతరం నిర్వహించిన ఇంటర్ జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎస్వీయూ కళాశాల కామర్స్, మేనేజ్‌మెంట్ కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ కె.జయచంద్రారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ ఎల్.లక్ష్మణరావు, ప్రిన్సిపల్స్ శ్రీనివాసులు, నేతాజీ, బాలాజీ, ఆంజనేయులు, బిందు మాధవి, హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తడ:చెన్నైకి గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఆదివారం శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.లక్ష విలువైన 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్‌లో సీఐ మురళీకృష్ణ వివరాలు వెల్లడించారు. తమిళనాడుకు చెందిన ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి బ్యాగులను తనిఖీ చేస్తే గంజాయి పట్టుబడినట్టు వివరించారు. దాడిలో ఎస్‌ఐ కొండపనాయుడు, సిబ్బంది ఉన్నారు.

కడూరులో కార్గో ఎయిర్‌పోర్టు?

తడ : శ్రీసిటీ పారిశ్రామికవాడ, మాంబట్టు, మేనకూరు ఏపీఐఐసీ సెజ్‌లతోపాటు షార్ అంతరిక్ష పరిశోధనా కేంద్రానికి అందుబాటుగా వరదయ్యపాళెం మండలం కడూరు వద్ద కార్గో ఎయిర్‌పోర్టు నిర్మించనున్నట్లు తెలిసింది. ఈ మేరకు సుమారు 400 ఎకరాలను వరదయ్యపాళెం, సత్యవేడు, తడ మండలాల్లోని భూములను సేకరించేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే అటవీ భూములను విమానాశ్రయానికి కేటాయించేందుకు ఫారెస్ట్ శాఖ అంగీకరించినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో తడ నుంచి శ్రీకాళహస్తి వెళ్లే రహదారి విస్తరణకు సైతం అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

ప్రసన్న వెంకన్న కల్యాణోత్సవంలో గందరగోళం

- వేదికపైకి ఎక్కిన ఆలయ సిబ్బంది పరివారం
- సిబ్బందితో వాగ్వాదానికి దిగిన భక్తులు


శ్రీనివాసుని కల్యాణోత్సవంలో వేదికపైకి ఎక్కిన ఆలయ సిబ్బంది బంధుగణం

రేణిగుంట : శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహణ లోపంతో గందరగోళానికి దారి తీసింది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వేంచేపు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణోత్సవం జరిపారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమం ప్రారంభం కాగానే ఆలయ సిబ్బంది, వారి బంధు పరివారం వేదికపైకి ఎక్కారు. దీంతో స్వామి వారి కల్యాణాన్ని తిలకించే అవకాశం భక్తులకు లేకుండా పోయింది. అసహనానికి గురైన భక్తులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. రాత్రి స్వామివారి గరుడసేవ ఘనంగా నిర్వహించారు.

ఈ వారంలోనైనా వేతనాలు అందేనా?

తిరుపతి సిటీ: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఒక నెలలోనైనా ఒకటో తారీఖు వేతనం చూడలేదని వేతనజీవులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఎస్వీయూ ఉద్యోగుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. వేతనాలు ఎప్పుడు పడతాయో తెలియని దయనీయస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో అధ్యాపకులకు గత మాసం వేతనలు నిచిపోయాయి. మార్చి 3వ తేదీ వస్తున్నా జనవరి, ఫిబ్రవరి మాసాల జీతాల కోసం అధ్యాపకులు ఎదురుచూడాల్సి వస్తోంది. ఈ వారంలోనైనా రెండు నెలల వేతనాలు అందేనా.. గోవిందా అంటూ వర్సిటీలో ఏ ఇద్దరు ఉద్యోగులు తారసపడినా ఇదే చర్చ సాగుతోంది. అలాగే గత మాసం నాన్ టీచింగ్ స్టాఫ్ సమ్మె సైరస్ మోగిస్తున్నామని హెచ్చరించడంతో అధికారులు శాశ్వత ఉద్యోగులకు డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి జీతాలు అందజేశారు. ఈ నెల ఎప్పటికి జీతం అందుతుందోనన్న అయోమయం ఉద్యోగుల్లో నెలకొంది.

పవిత్రం.. రంజాన్ మాసం


జామియా మసీదు వద్ద ఆష్ సేవిస్తున్న ముస్లింలు


ఆష్ పంపిణీ చేస్తున్న దృశ్యం

- భక్తిశ్రద్ధలతో ముస్లింల ఉపవాస దీక్షలు
- మసీదుల్లో నిత్యం 'ఆష్' పంపిణీ

నాయుడుపేటటౌన్ : రంజాన్ మాసంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేపడుతున్నారు. వేకువజామున సహరీ చేసిన తర్వాత సాయంత్రం వరకు అన్నపానీయాలు స్వీకరించకుండా కఠిన నియమాలను పాటిస్తున్నారు. రంజాన్ మాసం సందర్భంగా మసీదుల వద్ద ప్రత్యేకంగా ఆష్ (గంజి) పంపిణీ చేస్తున్నారు. ఉపవాస దీక్ష చేపట్టిన వారికి ఇఫ్తార్ సమయంలో అందిస్తున్నారు. ఈ క్రమంలోనే పలువురు ముస్లింలు మసీదుకు వచ్చేప్పుడు ఇఫ్తార్ విందు కోసం ఖర్జూరాలు, అరటి పండ్లు, తదితర తినుబండారాలను తీసుకువస్తున్నారు. సామూహికంగా ఉపవాస దీక్షలున్నవారికి పంపిణీ చేస్తున్నారు. ముఖ్యంగా మసీదుల వద్ద అందించే ఆష్ కోసం పెద్దసంఖ్యలో జనం బారులు తీరుతున్నారు. ఆష్‌ను ఇంటికి తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో సేవిస్తున్నారు. హిందువులు సైతం మసీదు వద్దకు వచ్చి ఆష్ స్వీకరించడం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. కొంత మంది మసీదుల వద్ద ఆష్ తయారు చేసేందుకు విరాళాలు సైతం అందిస్తున్నారు. ఈ క్రమంలోనే కఠిన ఉపవాస దీక్ష పాటిస్తూ చిత్తశుద్ధితో అల్లాహ్‌ను ప్రార్థిస్తే చక్కటి జీవిత గమనం పొందవచ్చని మౌలానాలు ప్రబోధిస్తున్నారు. ఈ మాసంలో ముస్లింలు వారి శక్తి మేరకు దానధర్మాలు చేస్తూ ఆధ్యాత్మిక చింతనతో గడుపుతున్నారు.

ఆరోగ్యానికి మంచిది



ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎలాంటి ఆహారం తీసుకోకుండా ఉపవాస దీక్షలు ఉండేవారు ఆష్ సేవిస్తే ఆరోగ్యానికి చాలా మంచిది. ఉపవాస దీక్ష విరమణకు మొదటగా ఆష్‌ను తీసుకుంటే కోల్పోయిన శక్తిని పొందడమే కాకుండా జీర్ణవ్యవస్థ సక్రమంగా ఉంటుంది. తర్వాత ఎలాంటి ఆహారం తీసుకున్నా ఇబ్బంది ఉండదు.

– పఠాన్ ఆరాఫత్ ఖాన్, నాయుడుపేట

200 ఏళ్లకు పైగా..



నాయుడుపేట పట్టణంలోని జామియా మసీదు (పెద్ద మసీదు)లో 200 ఏళ్లకు పైగా రంజాన్ మాసంలో క్రమం తప్పకుండా ఆష్ పంపిణీ జరుగుతోంది. వెంకటగిరి రాజాల పాలనలో అప్పటి సామంత రాజులుగా ఉన్న ఆర్కాట్ నవాబులు జామియా మసీదును నిర్మించారు. అప్పటి నుంచి ఈ మసీదులో ఉపవాస దీక్ష పాటిస్తున్న వారికి ఆష్ పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికీ ఆ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోంది.

– హాజీ రంతుల్లా సాహెబ్, జామియా మసీదు ముతవల్లి